క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్

రాయికల్: పట్టణంలోని నాలుగో వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగో వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వాటర్‌ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు బాబా, శ్వేత, మహిళలు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి చెరువులో తొలగిస్తున్న మట్టి పూడికతీత పనులను గురువారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పనికి హాజరైన కూలీల సంఖ్య, మస్టర్లు, పనులు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెరువులో పూడికతీతతో వస్తున్న నల్ల మట్టిని పంట పొలాల్లోకి రైతులు తరలించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ట్రాక్టర్లు సమకూర్చుకుంటే ఉపాధిహామీ కూలీలే ఉచితంగా ట్రాక్టర్ల ట్రాలీల్లో మట్టిని నింపుతారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి, ఎఫ్ఏ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న డీఎస్పీ

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు గురువారం పరిశీలించారు. పోలింగ్ రోజు పోలీస్ బందోబస్తు ఏర్పాటు విషయంపై అధికారులతో చర్చించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆయన వెంట ఎస్సై నవీన్ కుమార్ ఉన్నారు.

ఓటేసేందుకు.. గిరిజనుల అవస్థలు

- దూరభారంతో ఇబ్బంది
- రోడ్డు సౌకర్యం సరిగాలేని వైనం
- మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు.. 36975 మంది ఓటర్లు



ఇప్పపెల్లి గిరిజన తండా

కథలాపూర్: కాలంలో వస్తున మార్పులకు అనుగుణంగా ఎన్నికల సరళిలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఓటుహక్కు నమోదు, తప్పులు సవరణ, ఫిర్యాదులపై స్పందన, గ్రామాల్లో బీఎల్వోలు నిరంతరం పర్యవేక్షణ, అరచేతిలో ఎన్నికల సమాచారం, సాంకేతికతతో కూడుకున్న ఇలా ఎన్నో కొత్త మార్పులు జరుగుతున్నాయి. కానీ ఓటరుకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలు ఉండటంలేదు. గ్రామాలకు కాస్తా దూరంగా నివసిస్తున్న గిరిజనులు వ్యయప్రయాసాల కోరి ఓటు వేస్తున్నారు.

మండలంలో గిరిజనులకు పోలింగ్ కేంద్రాలు దూరం

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. 36,975 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 17,430 మంది, మహిళలు 19,545 మంది ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ గిరిజన తండాలకు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటంతో వారు ఓటు వేయడానికి రావాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉన్న గ్రామాల తండాలు ఇవే.. పోతారం గ్రామంలో పోలింగ్ కేంద్రం ఉండగా రెండు గిరిజన తండాలు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. వీరు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలంటే కనీసం ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. కాలినడకన లేదా ప్రత్యేకంగా ఆటోల రవాణా ఖర్చులు భరించి ఓటు వేయాల్సిన పరిస్థితి. ఇప్పపెల్లి గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో గిరిజన తండా ఉంది. వీరు ఓటు వేయాలంటే అవస్థలే. అంబారిపేట గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో తండా ఉంది. కలిగోట గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో గిరిజన తండా ఉంది. వీరు ఓటు వేయాలంటే కిలోమీటర్ల దూరం వెళ్లడానికి కష్టమని ఆందోళన చెందుతున్నారు. పోలింగ్ శాతం పెంచాలని ఎన్నికల సంఘం అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా.. పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న ఓటర్లకు రవాణా సౌకర్యం లేక అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో పట్టించుకోకపోవడం దారుణమని గిరిజనులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ పార్లమెంట్ ఎన్నికల వేళ ఓటర్లకు రవాణా సౌకర్యం, మొబైల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందని గిరిజనులు కోరుతున్నారు.

ఓటేయడానికి వెళ్లడం కష్టం



ఎన్నికలప్పుడు ఓటు వేయాలని పాలకులు, అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తారు. కానీ పోతారం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలంటే గిరిజన తండా నుంచి నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. వృద్ధులు దూరం నడవలేక ఓటు వేయడానికి ఇష్టపడటం లేదు. ఎన్నికలప్పుడు గిరిజనులకు సౌకర్యం కల్పించడంపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– లోక్యనాయక్, పోతారం గిరిజన తండా

రోడ్డు అధ్వానంగా ఉంది



ఇప్పపెల్లి గ్రామానికి మా గిరిజన తండా రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఎన్నికలప్పుడు ఓటు వేయడానికి వెళ్దామంటే రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉంది. ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి. అవస్థలు పడుతూ పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి గిరిజనులు ఇష్టపడటం లేదు. గిరిజన తండాల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. లేకపోతే ప్రభుత్వ పరంగా రవాణా సౌకర్యం కల్పించాలి.

– పంతులనాయక్, ఇప్పపెల్లి గిరిజన తండా

బీజేపీలో చేరిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్, సర్వాపూర్ గ్రామాలకు చెందిన పలువురు, మాజీ ఎంపీటీసీ కోను లక్ష్మణ్, పెరిక సంఘం అధ్యక్షుడు కోట మహేశ్, దొమ్మాటి భూమయ్య,కాసర్ల నారాయణ, బైరి అనంతరెడ్డితో పాటు సుమారు 100 మంది యువకులు కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రవణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: కరీంనగర్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కు మద్దతుగా వేములవాడ బీజేపీ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి మాచాపూర్‌లో ఇంటింటా ప్రచారంలో పాటు, ఉపాధిహామీ కూలీలు, కుల సంఘలను కలిసి బండిసంజయ్ ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కారంఢ్ల మదుకర్, తొగరి లక్ష్మీపతి, ఎస్.ఎన్ రెడ్డి, అన్నాడి జలపతి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఘనత బీజేపీదే

కథలాపూర్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి మధుశ్రీ అన్నారు. గురువారం మండలం సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, మండల కోఆర్డినేటర్ సంపత్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, గాండ్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్ చైర్మన్‌గా రవీందర్

రాయికల్: మండలంలోని అల్లీపూర్ వేంకటేశ్వర స్వామి దేవస్థానం శాశ్వత అన్నదాన ట్రస్ట్ చైర్మన్‌గా ఎర్రవేణి రవీందర్ శుక్రవారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కొప్పుల దేవి, ప్రధాన కార్యదర్శిగా కట్ట రాజేశ్, కోశాధికారిగా కొల్లూరి రాజేశ్, ప్రచార కార్యదర్శిగా అత్తినేని నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా గొడ్డండ్ల శేఖర్, చిల్కుల ప్రేమ్‌చంద్, గౌరవ సలహాదారులుగా మండ రవి, వేముల సతీశ్, శ్రీరాముల గణపతి, బాలె చంద్రశేఖర్, అత్తినేని గంగారెడ్డి, మోర వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా రమ

రాయికల్: బీజేపీ రాయికల్ పట్టణ మహిళ మోర్చా అధ్యక్షురాలిగా వాసరి రమను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి గురువారం తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల రూరల్: బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని మాదాపూర్, గుమ్లాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వెంకటాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సింగిల్‌విండో చైర్మన్ ఆదిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ పుట్టుకే మాదిగలకు వ్యతిరేకం

సారంగాపూర్: బీజేపీ పుట్టుకే మాదిగ సామాజిక వర్గానికి వ్యతిరేకమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం బీర్‌పూర్ మండలం ఇందిరానగర్, నర్సింహులపల్లె గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రతీ మాదిగ బీఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు దుమాల రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

సారంగాగపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటువేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, తేలు రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా

రాయికల్: దేశ ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి చెందుతుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం రాయికల్ పట్టణంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా స్ట్రీట్ కార్నర్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, దేశప్రధాని నరేంద్రమోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పడాల తిరుపతి, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ మోదీతోనే సాధ్యం

మల్లాపూర్: ఆత్మగౌరవం ఉన్న మాదిగ బిడ్డలెవరూ కాంగ్రెస్‌కు ఓటు వేయరని ఎంఎస్పీ-ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగరాం మాదిగ అన్నారు. గురువారం మల్లాపూర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు, మండల ఇచార్జ్ రుద్ర శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రస్తుత లోకసభ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క స్థానం కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీకి మాదిగల ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఈ ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎంపీగా అర్వింద్‌ని గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్(జగన్), నాయకులు మాట్ల బుచ్చన్న, బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

మనం వేసే ప్రతి ఓటు మోదీ ప్రధానిగా కావడానికి బాటలు

సారంగాపూర్: ఓటర్లు బీజేపీకి వేసే ప్రతి ఓటు ప్రధానిగా నరేంద్ర మోదీ కావడానికి బాటలు వేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. గురువారం మండలంలోని పెంబట్ల, లక్ష్మీదేవిపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, సింహరాజుల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

వారసంతలో బీజేపీ ప్రచారం

జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంగడిబజారులోని వారసంతతో పాటు సమీప కాలనీల్లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పట్టణ అద్యక్షుడు రంగు గోపాల్, ఆముద రాజు, చెన్నాడి మధురిమ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీని ఓడించాలి

జగిత్యాలటౌన్: బీసీ కులగణన పేరుతో బడుగు, బలహీన వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్, పెట్రోల్,డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్న బీజేపీ పార్టీలను ఓడించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చిర్ర శంకర్ కోరారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో బీఎస్పీ అభ్యర్థి పుప్పాల లింబాద్రికి మద్దతుగా గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.సామాజిక న్యాయం సాధించాలంటే బీఎస్పీ ఏనుగు గుర్తుకు ఓటువేసి పార్టీ అభ్యర్థి పుప్పాల లింబాద్రిని నిజామాబాద్ ఎంపీగా గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సంపత్ కుమార్, లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.